క్లుప్తంగా

సమ్మెను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు

కల్లూరు: భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 9న చేపట్టనున్న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం నగర అధ్యక్షులు సుధాకరప్ప కోరారు. గురువారం కల్లూరులోని సూర్యనారాయణ భవనంలో మట్టి పని అడ్డా కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వాలు కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించి సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. సమావేశంలో భవన నిర్మాణ సంఘం నాయకులు యేసు, ఆంజనేయులు, రత్న, పక్కీరప్ప, మునిస్వామి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లోని సమస్యలను పరిష్కరించండి



మాట్లాడుతున్న ఎంపీడీఓ రాణెమ్మ

సి.బెళగల్: గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పంచాయతీ కార్యదర్శులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఎంపీడీఓ రాణెమ్మ సూచించారు. ఆమె గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల అధికారులతో కలిసి పంచాయతీ కార్యదర్శులతో (పీఎస్‌లతో) సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. గ్రామాలలో చేపట్టే పనుల్లో నిర్లక్ష్యం వహించరాదని, విధులకు రెగ్యులర్‌గా హాజరవుతూ, ప్రజల సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలన్నారు. అదేవిధంగా గ్రామాల్లో చెత్త సేకరణ, సచివాలయాల నిర్వహణ, స్వర్ణ పంచాయత్, సిబ్బంది బదిలీలు, పారిశుద్ధ్య పనులపై పీఎస్‌లతో సమీక్షించారు. కార్యాలయ ఏఓ శ్రీనివాసులు, సిబ్బంది మంజుల, పీఎస్‌లు ఉన్నారు.

మొహర్రం ప్రశాంతంగా జరుపుకోవాలి



మాట్లాడుతున్న ఎస్‌ఐ ఎర్రిస్వామి

కోడుమూరు రూరల్: మొహర్రం ఉత్సవాలను గ్రామస్తులు ప్రశాంతంగా జరుపుకోవాలని కోడుమూరు ఎస్‌ఐ ఎర్రిస్వామి సూచించారు. గూడూరు ఎస్‌ఐ తిమ్మయ్య సెలవుపై వెళ్లిపోవడంతో కోడుమూరు ఎస్‌ఐ ఎర్రిస్వామి గూడూ రు పీఎస్ ఇన్‌చార్జ్‌గా వ్యవహరిస్తున్నారు. గురువారం ఎస్‌ఐ ఎర్రిస్వామి గూడూరు పోలీస్ స్టేషన్‌ను సందర్శించి శాంతి భద్రతలపై సిబ్బ ందితో సమీక్షించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ.. మొహర్రం సందర్భంగా గ్రామాల్లో అలజడు లు లేకుండా ఉత్సవాలను ప్రజలంతా ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. ఎవరైనా హద్దు మీరి ప్రవర్తిస్తే చర్యలు తప్పవని ఎస్‌ఐ హెచ్చరించారు.

టీబీ పరీక్షలు చేయించుకోండి



అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారి హేమలత

కర్నూలు(రూరల్): పోషకాహార లోపం ఉన్నవారు టీబీ పరీక్షలు చేయించుకోవాలని, గార్గేయపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ హేమలత సూచించారు. ఆమె గురువారం కర్నూలు మండలం పసుపుల గ్రామంలో నిర్వహిస్తున్న టీబీ ముక్త అభియాన్ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, రాత్రి పూట చెమటలు పట్టడం, 60 ఏళ్లు పైబడి పొగ తాగేవారు, మద్యం సేవించేవారు, పౌష్టికాహార లోపం ఉన్న వారికి టీబీ, గళ్ల పరీక్షలు, ఎక్స్‌రేలు చేయించాలన్నారు. టీబీ రోగులకు దాతల సహకారంతో ప్రతినెలా పౌష్టికాహారం అందించాలని సూచించారు. టీబీని జయించిన వారి అనుభవాలను గ్రామస్తులతో పంచుకోవాలన్నారు. సర్పంచ్ సుశీలమ్మ, పీహెచ్‌ఎన్ హనుమంతమ్మ, మేల్ హెల్త్ సూపర్‌వైజర్ వేణుగోపాల్, టీబీ సూపర్‌వైజర్ నిషిత్, ఎంఎల్‌హెచ్‌పీ నమ్రత,వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు చేపట్టాలి

కర్నూలు(అర్బన్): నగరంలోని ఇందిరాగాంధీ నగర్ ఎస్సీ కళాశాల బాలుర వసతి గృహంలో విద్యార్థులకు అందిస్తున్న సరుకులను ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీ చేయాలని నవ్యాంధ్ర స్టూడెంట్ జేఏసీ అధ్యక్షుడు అయ్యస్వామి, మాల విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కే.వెంకటేష్ కోరారు. ఈ మేరకు గురువారం అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్‌ను కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. హాస్టల్‌కు నాసిరకమైన కూరగాయలు, సరుకులను సరఫరా చేస్తూ వార్డెన్ నాణ్యమైన భోజనం అందించడం లేదన్నారు. దీంతో విద్యార్థులు అనారోగ్యానికి గురవుతున్నారన్నారు. అధికారులు తనిఖీలు నిర్వహించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

విద్యార్థులకు దాహం.. దాహం



ఇంటి నుంచి బాటిళ్లలో నీటిని తెచ్చుకొని భోజనం చేస్తున్న విద్యార్థులు



మరమ్మతులు చేయించకపోవడంతో వృథాగా మారిన ఆర్‌ఓ ప్లాంటు

కర్నూలు(రూరల్): మండల పరిధిలోని పూడూరు మండల ప్రాథమిక పాఠశాలలో తాగునీరు అందుబాటులో లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పాఠశాలలో ఆర్‌ఓ ప్లాంటును ఏర్పాటు చేసింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మరమ్మతులకు గురైన ప్లాంటును అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ సమస్యపై ప్రధానోపాధ్యాయుడు గతంలో మండల విద్యాధికారికి ఫిర్యాదు చేసినా ఇంతవరకు చర్యలు తీసుకోలేదు. పాఠశాలలో 70 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వారంతా పాఠశాలలోనే మధ్యాహ్న భోజనం చేస్తారు. భోజనం సమయంలో, దాహం వేసినప్పుడు తాగునీరు లేక అల్లాడుతున్నారు. పాఠశాలలో తాగునీరు లేకపోవడంతో విద్యార్థులు వారి ఇళ్ల నుంచి బాటిళ్లలో నీరు తెచ్చుకుంటున్నారు. చిన్న పిల్లలు చదువుకునే పాఠశాలలో మంచి నీరు అందుబాటులో లేకపోవడం ఏమిటని, వారంతా గుర్తుపెట్టుకొని ఇంటి నుంచి నీటిని తెచ్చుకుంటారా? అని విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు ప్రశ్నిస్తున్నారు. బాటిళ్లలో తెచ్చుకున్న నీరు అయిపోతే ఏమి చేయాలని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యార్థులకు మంచినీరు అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

- వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు కాటసాని రాంభూపాల్‌రెడ్డి



కాటసాని రాంభూపాల్‌రెడ్డి, శివనరసింహారెడ్డిని సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

కల్లూరు: కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, పాణ్యం మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి పార్టీ శ్రేణులకు సూచించారు. వైఎస్సార్‌సీపీ మేధావుల ఫోరం కర్నూలు జిల్లా వైస్ ప్రెసిడెంట్‌గా భీమశంకర్‌రెడ్డి, సెక్రటరీగా సత్యంరెడ్డి, సోషల్ మీడియా ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా హేమంత్‌రెడ్డి, మైనారిటీ విభాగం జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా మొగల్ రోమ్ బేగ్ నియమితులయ్యారు. వీరు గురువారం కాటసాని రాంభూపాల్‌రెడ్డి, శివనరసింహారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి, పూలమాలతో సత్కరించి, కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కాటసాని రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. ఇదే విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, ఓర్వకల్లు ఎంపీపీ తిప్పన్న పాల్గొన్నారు.

సామాజిక తనిఖీకి సహకరించాలి



మాట్లాడుతున్న ఏపీడీ అల్లిపీర

సి.బెళగల్: మండలంలో జరిగిన అభివృద్ధి పనులపై త్వరలో చేపట్టనున్న సామాజిక తనిఖీకి ఆయా శాఖల మండల అధికారులు, ఉపాధి హామీ అధికారులు, సిబ్బంది సహకరించాలని ఏపీడీ అల్లిపీర అన్నారు. గురువారం ఎంపీడీఓ రాణెమ్మ అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సామాజిక తనిఖీల అధికారులు (డీఆర్పీలు), ఉపాధి హామీ అధికారులతో స్టేట్ రీసోర్స్ పర్సన్ (ఎస్‌ఆర్పీ) వెంకటేష్‌నాయక్ సమన్వయ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఏపీడీ, అధ్యక్షుడు, ఎంపీడీఓలు సమావేశంలో మాట్లాడుతూ.. మండలంలోని గ్రామాల్లో సామాజిక తనిఖీ అధికారులు చేపట్టే తనిఖీలకు ఆయా శాఖల మండల అధికారులు, సిబ్బంది తనిఖీ ఉద్యోగులు సమన్వయంతో సహకరించాలని సూచించారు. తనిఖీలలో సమస్యలు లేకుండా ఏడు రిజిష్టర్లు, పనుల ఓచర్లు, ఎం బుక్కులు, ఉపాధి హామీ పనులకు సంబంధించిన మూడ దశల ఫొటోలను తనిఖీ అధికారులకు అందజేయాలని సూచించారు. మండలంలో ఏప్రిల్ 1వ తేదీ 2024 నుంచి మార్చి 31వ తేదీ 2025 మధ్యకాలంలో మండల పరిధిలోని 18 గ్రామ పంచాయతీలలో పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా, గృహ నిర్మాణ, సామాజిక భద్రత పింఛన్ల పథకాలలో భాగంగా చేపట్టిన 1,081 పనులకు దాదాపు రూ.15 కోట్ల ఖర్చులపై సామాజిక తనిఖీలు చేపట్టడం జరుగుతుందని ఎస్‌ఆర్పీ తెలిపారు. అదనపు ఎస్‌ఆర్పీ కాంతయ్య, ఉపాధిహామీ ఏపీఓ రామన్న, ఈసీ రంగస్వామి, టీఏలు, ఎఫ్ఏలు, సీఓలు ఉన్నారు.

మోడల్ స్కూల్‌కు రోడ్డు నిర్మించాలి



ధర్నా చేస్తున్న విద్యార్థులు

కోడుమూరు రూరల్: కోడుమూరు మోడల్ స్కూల్‌కు రహదారి ఏర్పాటు చేయాలంటూ విద్యార్థులు గురువారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో బురద నీటిలో నిలబడి ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి రంగస్వామి మాట్లాడుతూ.. పట్టణానికి దూరంగా పొలాల్లో మోడల్ స్కూల్‌ను ఏర్పాటు చేసిన అధికారులు రహదారిని నిర్మించకుండా మట్టి రోడ్డు వేయడంతో పాఠశాలకు వెళ్లేందుకు విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. చిన్నపాటి వర్షం పడినా దారంతా బురదమయంగా మారుతుండడంతో పాఠశాలకు నడిచివెళ్లేందుకు విద్యార్థినీ, విద్యార్థులు బురదలో పడుతూ లేస్తూ వెళ్తున్నారని వాపోయారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి మోడల్ స్కూల్ వెళ్లేందుకు సీసీ రోడ్డు నిర్మించాలని డిమాండ్ చేశారు. స్థానిక ఏఐఎస్ఎఫ్ నాయకులు అల్తాఫ్‌బాషా, వీరేంద్ర, బాలాంజనేయులు, సిద్ధు, అశోక్, చరణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

మాతాశిశు సంరక్షణకు కృషి



బుక్‌లెట్ అందిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ పి.శాంతికళ

కర్నూలు(హాస్పిటల్): మాతాశిశు సంరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ పి.శాంతికళ సూచించారు. స్థానిక కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ఓల్డ్ క్లినికల్ లెక్చరర్ గ్యాలరీలో గురువారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో పనిచేసే వైద్యులకు హైరిస్క్ గర్భిణులకు అందించాల్సిన సమగ్ర సేవలపై రెండు రోజుల శిక్షణ కార్యక్రమం అర్మాన్ సంస్థ ద్వారా నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ.. గర్భిణీగా నిర్ధారణ అయిన వెంటనే తగిన వైద్య పరీక్షలు చేయాలని చెప్పారు. నిర్ణీత సమయంలో వీరికి స్కానింగ్, పరీక్షలు, వైద్యసేవలను అందిస్తూ ప్రసవం సురక్షితంగా అయ్యే విధంగా చూడాలని చెప్పారు. పరీక్షలు, వైద్య సేవల వివరాలను మాతాశిశు సంరక్షణ కార్డులో నమోదు చేయాలన్నారు. అనంతరం పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా గర్భిణులలో ప్రమాదకర పరిస్థితులను ముందుగా అంచనా వేసి క్షేత్రస్థాయి స్పెషలిస్టు స్థాయి వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఫాలో అప్ సేవల గురించి డాక్టర్ భావన, డాక్టర్ రోహిణి వివరించారు. డీఐఓ డాక్టర్ నాగప్రసాద్, రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం సమన్వయకర్త డాక్టర్ మహేశ్వరప్రసాద్, సంచార చికిత్స కార్యక్రమం జిల్లా నోడల్ అధికారి డాక్టర్ రఘు, డీపీఎంఓ డాక్టర్ ఉమ, డాక్టర్ రత్నకుమారి, డాక్టర్ శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్లలో నాణ్యత పాటించాలి



అన్న క్యాంటీన్‌లో ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న ఇన్‌చార్జ్ కలెక్టర్ బి.నవ్య

కర్నూలు (టౌన్): అన్న క్యాంటీన్లలో భోజనం నాణ్యతగా ఉండాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ బి.నవ్య అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్ ప్రాంగణంలో ఉన్న అన్న క్యాంటీన్‌ను ఇన్‌చార్జ్ కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడున్న వినియోగదారులతో మాట్లాడారు. ఏమైనా లోపాలు ఉన్నాయా? అని ఆరా తీశారు. క్యాంటీన్‌లో ఆహార పదార్థాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జ్ కలెక్టర్ మాట్లాడుతూ.. అన్న క్యాంటీన్ పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. సరైన సమయానికి క్యాంటీన్‌ను తెరవాలన్నారు. నాణ్యత లోపించకుండా, ఫిర్యాదులు రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

చినుకు పడితే చిత్తడే!

రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో మట్టి రోడ్లు, గుంతలమయంగా ఉన్న రోడ్లు చిత్తడి చిత్తడిగా మారాయి. బస్తిపాడు గ్రామంలోని ఎస్సీ కాలనీలో ఉన్న రోడ్డుపై చిన్నపాటి వర్షం కురిసినా నీరు నిలుస్తోంది. దీంతో రోడ్డుపై నడవాలంటే ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. అధికారులు స్పందించి రోడ్డుపై వర్షం నీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. – కల్లూరు

ఇళ్ల ముందే మురుగు

- గూడూరు తెలుగు వీధిలో పడకేసిన పారిశుద్ధ్యం
- పట్టించుకోని అధికారులు



గూడూరు తెలుగు వీధిలో ఇళ్ల ముందు నిలిచిన మురుగు

కోడుమూరు రూరల్: గూడూరులోని తెలుగువీధిలో మురుగు నీరు బయటకు వెళ్లే కల్వర్టు దెబ్బతినడంతో నీరంతా ఇళ్ల ముందే నిలిచిపోతుంది. కాలనీలో నుంచి మురుగునీరు వెళ్లేందుకు కల్వర్టును నిర్మించాలని ఏళ్ల తరబడి ప్రజలు కోరుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. నిత్యం ఇళ్ల ముందరే మురుగు నీరు నిల్వ ఉంటుండడంతో ఏదైనా పని మీద ఇంట్లో నుంచి బయటకు వెళ్లాలన్నా, బయట నుంచి ఇంట్లోకి రావాలన్నా మురుగు నీటిలో నడిచి వెళ్లాల్సిందేనంటూ కాలనీవాసులు వాపోయారు. పెద్దవాళ్లు ఎలాగోలా నడిచివెళుతున్నా చిన్నపిల్లలు, వృద్ధుల పరిస్థితి దారుణంగా ఉంటోందని వాపోయారు. నిత్యం మురుగునీటి నిల్వతో తీవ్రమైన దుర్గంధం వెదజల్లుతుండడంతో తాము ఇళ్లలో ఉండలేని పరిస్థితి నెలకొందని, మురుగునీటి వల్ల దోమలు విపరీతంగా వ్యాప్తి చెందడంతో రోగాల భారిన పడుతున్నామంటూ కాలనీవాసులు వాపోయారు. వర్షాకాలంలో ఈ సమస్య మరింత తీవ్రంగా ఉంటోందని, మురుగునీటికి వాన నీరు తోడై తమ ఇళ్లలోకి వస్తున్నాయంటూ కాలనీవాసులు వాపోయారు.

తమ పరిధి కాదని దాటవేస్తున్న నగర పంచాయతీ అధికారులు

తెలుగు వీధిలో మురుగునీరు వెళ్లేందుకు కల్వర్టును నిర్మించాలని నగర పంచాయతీ అధికారులను కోరుతున్నా పట్టించుకోవడం లేదు. కల్వర్టు నిర్మించాల్సిన రోడ్డు ఆర్‌అండ్‌బీ పరిధిలో ఉందంటూ నగర పంచాయతీ అధికారులు దాటవేస్తున్నారని కాలనీ వాసులు వాపోయారు. జిల్లా ఉన్నతాధికారులైనా స్పందించి మురుగునీరు వెళ్లేందుకు కల్వర్టును నిర్మించి తమ సమస్యను పరిష్కరించాలని, లేకపోతే తాము ఇళ్లను ఖాళీ చేసి వెళ్లాల్సిన దుస్థితి దాపురిస్తుందని కాలనీప్రజలు వాపోతున్నారు.

కోడుమూరులో 23.6 మి.మీ వర్షం

కోడుమూరు రూరల్: కోడుమూరులో 23.6 మి.మీ వర్షపాతం నమోదైంది. బుధవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు వాన కురవడంతో, ఇన్నాళ్లు వానల్లేక ఇబ్బందులు పడుతున్న రైతులకు ఊరట లభించింది. ఖరీఫ్ ప్రారంభంలో కురిసిన వర్షాలకు మండలంలోని రైతులు భారీగా పత్తి పంటను సాగు చేశారు. అలాగే మరిన్ని వానలు పడితే కంది పంటను సాగు చేయాలని రైతులు ఎదురు చూస్తున్నారు. ఈ సమయంలో గత రెండు వారాలుగా వానలు పడకపోవడంతో ఇటు పంటలు సాగు చేసిన రైతులతో పాటు, అటు పంటలు సాగు చేయాలని ఆశగా ఎదురు చూస్తున్నా రైతుల్లో ఆందోళన నెలకొంది. ఈ నేపథ్యంలో మంచి పదును వాన కురవడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

రైతుల పట్ల నిర్లక్ష్యం వీడాలి

పాణ్యం: రాయలసీమ రైతుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలని రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రామచంద్రుడు, సీఐటీయూ మండల కార్యదర్శి భాస్కర్ కోరారు. గురువారం వారు మాట్లాడుతూ శ్రీశైలం డ్యాంలో 854 అడుగులకు పైగా ఉండటంతో నీటిని సాగు కోసం వదలాలన్నారు. నీటిని వదలకపోవడంతో పైర్లు ఎండిపోతున్నాయన్నారు. మరోవైపు పొగాకు రైతులు మద్దతు ధర కోసం రోడ్డుక్కుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం తగదన్నారు.

అభివృద్ధిపై సమీక్ష



మాట్లాడుతున్న ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్

పాణ్యం: నియోజకవర్గ అభివృద్ధి ప్రణాళిక విజన్‌పై గురువారం ఎంపీడీఓ కార్యాయలంలో సమీక్ష చేపట్టారు. డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి, ఎమ్మెల్యే గౌరు చరితా, నాలుగు మండలాల ఎంపీడీఓలు, రెవెన్యూ అధికారులు, సచివాలయాల సిబ్బంది హాజరై ప్రజలకు కల్పించాల్సిన మౌలిక సదుపాయాలపై చర్చించారు. అభివృద్ధి ప్రణాళికను పరిశీలించారు.

తరగతుల నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు



ప్రత్యేక తరగతులను పరిశీలిస్తున్న ఎంఈఓ-2 సుబ్రహ్మణ్యం

పాణ్యం: ప్రభుత్వ పాఠశాలలో వెనుకబడిన విద్యార్థుల కోసం నిర్వహించే ప్రత్యేక తరగతుల నిర్వహనలో ఎలాంటి నిర్లక్ష్యం వహించరాదని ఎంఈఓ–2 సుబ్రహ్మణ్యం ఉపాధ్యాయులకు సూచించారు. గురువారం పాణ్యం, బలపనూరు తదితర గ్రామాల పాఠశాలలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం ప్రత్యేక తరగతులు నిర్వహించి, వెనుబడిన విద్యార్థులను తీర్చిదిద్దాలన్నారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం అమలు చేయాలన్నారు.

సిబ్బంది సమయపాలన పాటించాలి



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు

కర్నూలు(హాస్పిటల్): ఆసుపత్రిలో పనిచేసే ఉద్యోగులు, సిబ్బంది సమయపాలన పాటించాలని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు ఆదేశించారు. గురువారం ఆసుపత్రిలోని మినిస్టీరియల్ స్టాఫ్, సిబ్బందితో ఆయన తన ఛాంబర్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. సిబ్బంది సమయపాలన, ఎఫ్‌ఆర్ఎస్, సెక్షన్ల వారీగా ఎవరు ఏ పని చేస్తున్నారు, వారి పనితీరు గురించి ఆరా తీశారు. ఆసుపత్రిలో నాల్గవ తరగతి ఉద్యోగుల గురించి, వారి పనితీరు గురించి అడిగి తెలుసుకుని అసహనం వ్యక్తం చేశారు. ఫోర్త్ క్లాస్ ఎంప్లాయిస్ డ్రెస్ కోడ్, ఐడీ కార్డు ధరించి ఎఫ్‌ఆర్ఎస్ వేసి విధులు నిర్వహించాలని ఆదేశించారు. లేకపోతే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎంఆర్‌టీ మెడికల్ రికార్డు సెక్షన్ ఉద్యోగులు రోగులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా త్వరలో రిపోర్ట్, డెత్, బర్త్ సర్టిఫికెట్లు జారీ చేయాలన్నారు. ఉద్యోగులు, సిబ్బంది అందరూ ఎఫ్‌ఆర్ఎస్ ద్వారానే తప్పనిసరిగా హాజరు వేయాలన్నారు. ఆసుపత్రికి వచ్చే ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని చెప్పారు. మినిస్టీరియల్ స్టాఫ్ సీట్ల మార్పు, ఇతర వాటిపై సమీక్ష నిర్వహించిన అనంతరం సిబ్బందిని పూర్తిస్థాయిలో ప్రక్షాళన చేసి ప్రజలకు, రోగులకు మెరుగైన వైద్యసేవలు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. డిప్యూటీ సీఎస్‌ఆర్‌ఎంఓ డాక్టర్ పద్మజ, అడ్మినిస్ట్రేటర్ సింధు సుబ్రహ్మణ్యం, ఏడీ మల్లేశ్వరమ్మ, ఏఓ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

అంబురం.. అరుణ వర్ణం!



అంబురం అరుణవర్ణమైంది. రోజంతా వీర విహారం చేసిన ఆదిత్యుడు సాయంత్రం అరుణ వర్ణపు అందాల్లో కనువిందు చేశాడు. ఎరుపు, నీలం రంగుల్లో ఆవిష్కృతమైన సుందర దృశ్యాన్ని గురువారం 'సాక్షి' కెమెరాలో బంధించింది. – గడివేముల

కొండలయ్య సరిగెత్తుకు సర్వం సిద్ధం



సి.బెళగల్‌లో కొండలయ్య సరిగెత్తుకు సిద్ధం చేస్తున్న వస్తాద్



ముదుమలగుర్తిలో కొలువుదీరిన పీర్లస్వాములు

సి.బెళగల్: మండల కేంద్రంలో గురువారం రాత్రి అనంతరం జరగనున్న కొండలయ్య సరిగెత్తుకు పీర్ల దేవుళ్లను సిద్ధం చేశారు. మోహర్రం ఉత్సవాల్లో భాగంగా మండలంలో ప్రథమంగా సి.బెళగల్‌లో నిర్వహించే కొండలయ్య సరిగెత్తుకు ప్రత్యేకత ఉంది. గురువారం రాత్రి నుంచి శుక్రవారం వేకువజామువరకు సరిగెత్తును నిర్వహించనున్నట్లు పాతకొండలయ్య మసీద్ వస్తాద్ పోలకల్ మహబూబ్ బాషా తెలిపారు. కొండలయ్య సరిగెత్తులో భాగంగా గ్రామస్తులు, వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు గురువారం అర్ధరాత్రి వరకు పెద్ద ఎత్తున మొక్కుబడులను సమర్పించుకోనున్నారు. ఆదివారం వేకువజామున కొత్త కొండలయ్య, జూములయ్యలతో కలిసి పాత కొండలయ్యను గ్రామంలో సరిగెత్తు నిర్వాహిస్తామని ముజావర్లు, గ్రామ పెద్దలు తెలియజేశారు.

నేడు చిన్న సరిగెత్తు

మోహర్రం వేడుకలలో భాగంగా శుక్రవారం మండలంలోని గ్రామాల్లో చిన్న సరిగెత్తు నిర్వహించనున్నట్లు ఆయా గ్రామాల నిర్వాహకులు తెలిపారు. మండల కేంద్రం సి.బెళగల్‌లోని బోయవీధిలో కొలువైన చిన్న ఇమాంఖాశీం, గొల్లలదొడ్డి గ్రామంలోని చందమామయ్య పీర్ల చావిడిలలో చిన్న సరిగెత్తులో భాగంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించి, తెల్లవారుజామున గ్రామాల్లో ఊరేగించడం జరుగుతుందని నిర్వాహకులు తెలియజేశారు. అలాగే ఇనగండ్ల, చింతమానుపల్లె, కంబదహాల్, బురాన్‌దొడ్డి, పలుకుదొడ్డి తదితర గ్రామాలలో చిన్న సరిగెత్తు నిర్వహించేందుకు గ్రామస్తులు పీర్ల చావిడిలలోని పీర్ల దేవుళ్లను సిద్ధం చేస్తున్నారు.

మొహర్రం సంబరాలు

కోడుమూరు రూరల్: మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే మొహర్రం ఉత్సవాలు మండలంలోని గ్రామాల్లో ఘనంగా జరుగుతున్నాయి. మొహర్రం సందర్భంగా కోడుమూరుతో పాటు, వర్కూరు, పులకుర్తి, కల్లపరి, వెంకటగిరి, గోరంట్ల, లద్దగిరి, అనుగొండ గ్రామాల్లోని చావిళ్లలో పీర్ల దేవుళ్లు కొలువుదీరగా, ప్రజలు ఆయా చావిళ్లకు వెళ్లి మొక్కుబడులు చెల్లించుకుంటున్నారు. శుక్రవారం చిన్న సరిగెత్తు నిర్వహించేందుకు గ్రామస్తులు సిద్ధమవుతున్నారు.